Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com

సంపుటి :1 సంచిక: 301 హైదరాబాద్ బుధవారం 17 -07 - 2024 పేజీలు: 8 రూ.3/-








## పారదర్శకంగా ప్రజాహిత పాలన

# అందించండి

- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గనిర్దేశనం
- అర్హులైన అందరికీ ఆరు గ్యారంటీలు చేరవేయాలి
- ఆగస్టు 15లోగా ధరణి సమస్యలు పరిష్కరించాలి
- ఆర్టీసీలో అద్దె బస్సులు నిర్వహించుకునేలా మహిళా సంఘాలకు అవకాశం
- రేషన్ కార్డు లేకున్నా పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలి
- పటిష్టమైన నిఘాతో ప్రభుత్వ భూములు, ఆస్తులను పరిరక్షించండి
- జిల్లాల కలెక్టర్లకు పలు ఆదేశాలు జారీచేసిన సీఎం

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై16:** పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకొని పనిచేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్లతో ఇది రెండో సమావేశమని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని సీఎం గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి వారధులు.. సారధులు మీరేనన్నారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామన్నారు. ఐఏఎస్ అధికారుల కెరీర్ లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని సీఎం అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పనిచేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందన్నారు.

మిగతా 2లో.



## లోతుగా విచారిస్తే అసలు విషయం తేలేది: జస్టిస్ నర్సింహారెడ్డి

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:**తాను విద్యుత్ కమిషన్ చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకోవడంపై జస్టిస్ నర్సింహారెడ్డి స్పందించారు. ఈ వ్యవహారంలో కోర్టు ప్రాథమిక వాదోపవాదాలు మాత్రమే విన్నట్లు ఆయన చెప్పా రు. కమిషన్ ముఖ్య ఉద్దేశమే బహిరంగ విచారణ అని, అం దుకే తాను ప్రెస్మీట్ పెట్టి ఎవరెవరిని విచారించామో వెల్లడిం చానన్నారు. మరింత లోతుగా విచారించి ఉంటే అసలు విషయం తేలేద న్నారు. ఇందులో తాను పక్షపాతంగా వ్యవహరించలేదన్నారు.

## రూ.300 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు...



2లో

## కవిత ఆరోగ్యం నిలకడగా ఉంది : వైద్యులు




**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించారు. వైద్యుల సూచన మేరకు అధికారులు ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి తీసుకువెళ్లారు.డిశ్చార్జ్ అయ్యాక ఆమెను నేరుగా తీహార్ జైలుకు తీసుకువెళ్లారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టైన కవిత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. మంగళవారం నాడు నీరసంతో కళ్ళు తిరిగి పడిపోవడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. కవిత రెండు గంటల పాటు ఆస్పత్రిలో ఉన్నారు. మనీలాండరింగ్ ఆరోపణలపై కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ఏప్రిల్ 11న సీబీఐ అధికారులు ఆమెను జైల్లోనే అదుపులోకి తీసుకున్నారు. కవిత నాలుగు నెలలుగా జైల్లో ఉన్నారు.

## రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి ఇదే ఉదాహరణ: కేటీఆర్




**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** పార్టీ మారిన ఎమ్మెల్యేలు వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారని వ్యాఖ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీని వాషింగ్ మెషీన్ పార్టీగా కాంగ్రెస్ అభివర్ణించిందని... ఇప్పుడు అదే పనిని కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేస్తోందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ తీసుకుంటే మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అంటున్నారని... ఇక్కడ మీరు చేస్తున్నది ఏమిటని అడిగితే సమాధానం లేదని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. విజిలెన్స్ దాడులతో బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడే భాయ్, చోటే భాయ్ లకు తేడాలేదని... ఢిల్లీలో బడే భాయ్ మోదీ రాజ్యాంగ సంస్థలను వాడుకుంటున్నట్టే... ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంస్థలను ఉపయో గించుకుంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని అన్నా రు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తమకు సాను భూతి ఉందని... ఎందుకంటే రాజకీయంగా వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. వారిని ఎవ రూ కాపాడలేరని... ప్రజలు వారిని శిక్షించడం ఖా య మని అన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవు... ఆత్మహత్యలేఉంటాయనడానికిఇదేఉదాహరణఅని చెప్పారు.

## ఎల్లుండి నుంచి రైతుల ఖాతాల్లోకి డబ్బులు : మంత్రి

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** జూలై 18నుంచి రైతులకు రుణమాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.మొదట లక్ష లోపు రుణాలకు సంబందించి రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు.మొదటి విడతగా రైతుల ఖాతాల్లోకి సుమారు 6వేల కోట్లు రూపాయలు జమ చేయనున్నట్లు తెలిపారు. లక్షకు పైగా రుణాలు ఉన్నవారికి మరో పదిరోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తుమ్మల అన్నారు. మొత్తంగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని చెప్పారు. కుటుంబ నిర్ధారణ కోసమే రేషన్ కార్డు అని అన్నారు.పాత పద్దతిలోనే కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. 60 లక్షల ఖాతాల్లో 6 లక్షల మందికి రేషన్ కార్డు లేదు. అలాంటి వారికోసం రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రుణమాఫి చేస్తామని ఇచ్చిన కొన్ని డబ్బులు వడ్డీకే సరిపోయాయన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తుంటే బీఆర్ ఎస్ మామీద నిందలు వేస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు అనేది కుటుంబ నిర్ధారణ కోసమే అన్నారు. దాదాపు 38 లక్షల కుటుంబాలు రుణాలు తీసుకున్నాయన్నారు. రుణమాఫీకోసం రూ. 31వేల కోట్లు ఖర్చు మంత్రి తుమ్మల అవుతుందన్నారు.

### ఎల్లుండి నుంచి రైతుల ఖాతాల్లోకి డబ్బులు



## తెలంగాణలోని అంగన్వాడీలకు గుడ్ న్యూస్....

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వనున్న సర్కారు
- టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష
- రెండు రోజుల్లో జీవో జారీ.. మంత్రి సీతక్క ప్రకటన




**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. ఇకపై పదవీ విరమణ చేసే సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తామని తెలిపారు. రెండు మూడు రోజులలో దీనికి సంబంధించి జీవో జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రహమత్ నగర్ లో జరిగిన 'అమ్మ మాట–అంగన్వాడీ బాట' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఈ ప్రకటన చేశారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద పదవీ విరమణ పొందే టీచర్ కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం అందజేయనుంది. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి చెప్పారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, రెండు మూడు రోజుల్లో ఈమేరకు జీవో విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.



2లో

## విద్యుత్ ఒప్పందాలపై విచారణకు కొత్త కమీషన్



2లో

## మాటకు కట్టుబడతా... రైతులకు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా..

# మాటకు కట్టుబడతా... రైతులకు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా..



**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** రైతుల రుణ మాఫీ విషయంలో తాను మాటకు కట్టుబడి ఉంటానని, ముందు పేర్కొన్నట్లుగా రైతన్నలకు రుణ మాఫీ చేసినట్లయితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తేల్చి చెప్పారు మాజీ మంత్రి హరీశ్ రావు..నేడు ఆయన హైదరాబాద్‌లో విలేఖరులతో మాట్లాడుతూ, ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.రైతు రుణ మాఫీ మార్గదర్శకాలలో రేషన్ కార్డుల ఉన్న వారికే రుణమాఫీ చేస్తామనడం సబబు కాదన్నారు. రైతు లందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, అలాంట ప్పుడు రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పాస్ బుక్‌లను ప్రామాణికంగా తీసుకుని రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. గతంలో ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. మాటలకు, చేతలకు ఈ ప్రభుత్వానికి పొంతన లేదని రుణమాఫీ చేయకపోతే తాము రైతుల తరపున ఆందోళన చేస్తామని, అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తామని హెచ్చరించారు.

# నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్షం నిర్వహించండి.. రేవంత్‌ను కోరిన ఆర్. కృష్ణయ్య



**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కోరారు. నిరుద్యోగుల ఉద్యమాలపై నిర్భందం సరికాదు అని కృష్ణయ్య పేర్కొన్నారు. నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన నిరుద్యోగ జేఏసీ సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థి నాయకులు వేముల రామకృష్ణ, గోరేగే మల్లేష్, మోదీ రాందేవ్, మధుసూదన్ రావు, శివకృష్ణ, వీరన్న, మణికంఠ, గోరేగే మల్లేష్ తదితరులు ప్రసంగించారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు ఇవే..1. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 1:100 కోరుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో అన్యాయం జరిగింది. దీనిపై చర్చించాలి.2. గ్రూప్-1లో 563 నుంచి 1600కు పోస్టులను పెంచాలని, గ్రూప్-2లో 780 నుంచి 2 వేలకు, గ్రూప్-3లో 1100 నుంచి 3 వేలకు పోస్టులు పెంచాలి.3. టీచర్ పోస్టులు 11 వేల నుంచి 25 వేలకు పెంచాలి.4. డీఎస్సీ రెండు నెలల పాటు వాయిదా వేయాలి.

# సీఎం నిర్ణయాన్ని స్వాగతించిన హరీశ్ రావు..

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** రేషన్ కార్డుకు ఆరోగ్య శ్రీ లింకు పెట్టవద్దని సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, రుణమాఫీ విషయంలో కూడా ఇవే వర్తింపజేయాలని మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత హరీష్ రావు అన్నారు.ఆరోగ్య శ్రీ కార్డు జారీ చేసే విషయంలో ఆహార భద్రత కార్డుకు లింకు పెట్టవద్దని అందరికీ ఆరోగ్య శ్రీ కార్డులను జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన హరీష్ రావు పలు కీలక వ్యాఖ్యలు చేశారు.రేషన్ కార్డుకు ఆరోగ్య శ్రీ లింకు పెట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నా మని అన్నారు.ఇదే సూత్రాన్ని రైతు రుణమాఫీకి వర్తింపజే యాలనీ రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పాస్ బుక్ నే రుణమాఫీ కి ప్రామాణికంగా తీసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాగా రుణమాఫీ నిబంధనల పై హరీష్ స్పందిస్తూ.. ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం అంటే లక్షలాది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమేనని, ఎన్నికలప్పుడు మభ్య పెట్టి, అధికారం చేజిక్కినాంక ఆంక్షలు పెట్టారని సోమవారం ట్వీ్ట్ చేశారు.




# రూ.300 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు...

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:** తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యయంతో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రపంచంలోని పది ప్రఖ్యాత యూనివర్సిటీలు ముందుకొచ్చాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా 25 దేశాల్లో కార్యక లాపాలు నిర్వహించే 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్(ఐఎస్ ఎఫ్) ', టెక్సస్ కేంద్రంగా ఉన్న 'స్టార్టప్ రన్ వే' సంస్థల ప్రతిని ధులతో మంగళవారం నాడు సెక్రటేరియట్ లోని తన కార్యాల యంలో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. అంతర్జాతీయంగా స్టార్టప్‌లను ప్రోత్సహించే ఈ రెండు సంస్థలకు అమెరికా లోని యూనిర్సిటీ ఆఫ్ టెక్సస్, యూకెలోని లండన్ బిజినెస్ స్కూల్ లాంటి పది ప్రఖ్యాత స్కిల్ యూనివర్సిటీలతో శిక్షణకు సంబం ధించిన ఒప్పందాలున్నాయి. సెప్టెంబర్ 26-28 ల మధ్య నగరంలో జరిగే ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ సదస్సులో ఈ యూనివర్సిటీల ప్రతినిధులు కూడా పాల్గొంటారని శ్రీధర్ బాబు తెలిపారు. ఐఎస్ ఎఫ్ ఛైర్మన్ డా. జె.ఎ.చౌదరి, డైరెక్టర్ శేషాద్రి వంగల ఆధ్వర్యంలో టెక్సస్ రిచర్డ్ సన్ సిటీ, ఫ్రిస్కో సిటీల ప్రతినిధులు తనను కలిసి తెలంగాణాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ'లో సంయుక్తంగా కార్యకలాపాలు చేపట్టడానికి ఆసక్తి వ్యక్తంచేసారని ఆయన వివరించారు. అమెరికా, బ్రిటన్ కు చెందిన కంపెనీలు ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు సంధానకర్తలుగా ఈ ప్రతినిధులు వ్యవహరిస్తారని వెల్లడించారు. తెలంగాణాలోని స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులకు అమెరికాలో మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి సహక రిస్తారని అన్నారు. తమ ప్రభుత్వం స్టార్టప్ ఫ్రెండ్లీ వాతావరణాన్ని ఇప్పటికే ఏర్పరిచిందని తెలిపారు. శ్రీధర్ బాబును కలిసిన ప్రతి నిధి బృందంలో టెక్సస్ లోని ఫ్రిస్కో నగరం మాజీ మేయర్ మహెర్ మేసో, రిచర్డ్ సన్ సిటీకి చెందిన ప్రతినిధులు క్రిష్ షాక్లెట్, గ్రెగ్ సోవెల్, స్టార్టప్ రన్ వే వ్యవస్థాపకుడు మహేశ్ నంద్యాల, సిఓఓ రవీంద్ర రెడ్డి, చిన్మయ్ దాస్, జ్యోత్స్న కొండపులి, అర్చన చిందం,ఐఎస్ఎఫ్ తరపున వేణుమాధవ్ గొట్టుపుల్లలు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ప్రజాహిత పాలన అందించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పనిచేసినా.. అక్కడి జిల్లా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని, తాము పనిచేసే ప్రాంత ప్రజలందరి అభిమానాన్ని అందుకునేలా పని చేయాలని సీఎం అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేసిందని, కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు సొంత కుటుంబసభ్యుడిలా స్పందించారు. వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. అక్కడి ప్రజలు కలెక్టర్ ను బదిలీ చేయకుండా అడ్డుకునేంత అనుబంధాన్నిసంపాదించుకోవాలని ఉదాహరణగా చెప్పారు.వివిధ రాష్ట్రాల నుంచి వివిధ సంస్కృతుల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తున్నారని, విధి నిర్వహణలో భాగంగా ఇక్కడి భాష నేర్చుకుంటే సరిపోదని, భాషతో పాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యం కావాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. తెలంగాణను తమ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని, ఇక్కడి ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు.ఒక శంకరన్, ఒక శ్రీధరన్ లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఐఏఎస్లు పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని.. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదన్నారు. తాము చేపట్టే ప్రతి పని.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు.జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతినెలా రూ.85వేలు ఖర్చు పెడుతుందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు.గతంలో పది పెద్ద జిల్లాలుండేవి.. అప్పుడు పది మంది కలెక్టర్లే ఈ రాష్ట్రాన్ని అద్భుతంగా నడిపించారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. అప్పటితో పోలిస్తే కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. అప్పుడు పది మంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది కలెక్టర్లు కలిసికట్టుగా ఎందుకు చేయలేరు..? ఎవరికి వారుగా మీ ఆలోచనలు, మీ పనితీరును సమర్థతను చాటుకోవాలి. ఇది ప్రజా ప్రభుత్వం. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ప్రజలకు విశ్వాసం కల్పించే బాధ్యత మీదే అని సీఎం కలెక్టర్లకు మార్గదర్శనం చేశారు.కలెక్టరేట్లలో ప్రతివారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్ లో ప్రజాభవన్ కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందని, అదే మీ పనితీరుకు అద్దం పడుతుందని సీఎం అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు.ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనేది ప్రభుత్వ ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని గృహ జ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకాలకు అర్హులైవరికైనా ఈ పథకం వర్తించకపోతే.. తమ ఆధార్, రేషన్ కార్డు, లేదా గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్తు సర్వీసు నెంబర్లు సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.ఆగస్టు 15లోగా పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు.మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మందిని సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీరిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం ప్రకటించారు. అయిదేండ్లలో రూ. లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, చేపట్టే వ్యాపారాలకు తమ వినూత్న ఆలోచనలు కూడా జోడించాలని కలెక్టర్లకు సూచించారు. ఆర్టీసీలో కొత్తగా అవసరమయ్యే అద్దె బస్సులు కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ భూములు, చెర్వులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీఎం కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అవసరమైతే జియో ట్యాగింగ్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానం చేసి.. ప్రభుత్వ భూములపై నిఘా ఉంచాలని సీఎం సూచించారు.రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని ఆదేశించారు. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సేవలందించే ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఉందని, అధ్యయనం చేసి అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. రూరల్ ఏరియాలో పనిచేసే డాక్టర్లకు పారితోషికం అందించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్ కు ఒక సీరియల్ నెంబర్ ఉండాలని, గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం చెప్పారు. స్థానికంగా స్వచ్ఛంద సంస్థల సహకారం, పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు తీసుకోవాలని, వ్యాపార వాణిజ్యవేత్తల భాగస్వామ్యం తీసుకొని వాటి నిర్వహణ మెరుగు పరిచే విధానాన్ని అవలంబించాలని సూచించారు. అనుభవజ్ఞులైన స్పెషాలిటీ డాక్టర్లను ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి వైద్య సేవలకు వినియోగించుకోవాలని, మిగతా డాక్టర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు.

# విద్యుత్ ఒప్పందాలపై విచారణకు కొత్త కమీషన్

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:**తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్కు కొత్త ఛైర్మన్ను సోమవారం లోపు నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అంశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ పంపిన సమన్లపై హైకోర్టు 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కమిషన్ ఛైర్మన్ను మార్చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.ఛైర్మన్ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీం కోర్టుకు లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయ స్థానం సమయమిచ్చింది. దీంతో కేసీఆర్ పిటిషన్పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ధర్మాసనం వెల్లడిం చింది. ఇరుపక్షాల తరపున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా.. కేసీఆర్ తరపున ముకుల్ రోహత్గీ వాదించారు.



# సింగరేణి బొగ్గు వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు : సింగరేణి చైర్మన్

**తెలంగాణ వీణ,హైదరాబాద్,జూలై 16:**రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న అనేక పరిశ్రమలకు బొగ్గునందిస్తున్న సింగరేణి సంస్థ తన వినియోగదారుల పట్ల స్నేహపూరితంగా వ్యవహరిస్తుందని సింగరేణి సంస్థ చైర్మన్ , ఎండీ ఎన్. బలరామ్ పేర్కొన్నారు. వారిని వినియోగదారులుగా కాకుండా ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తోందని, వారి సౌకర్యం కోసం ఒక ప్రత్యేక సమన్వయ సెల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ-వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, సమాచార లోపం లేకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. దేశంలోని ఏ ఇతర బొగ్గు సంస్థల్లో లేనివిధంగా సింగరేణిలో ఈ-వేలం వినియోగదారులకు అనేక వెసులుబాట్లను కల్పించామన్నారు.కోల్ ఇండియాలో ఈ-వేలం సేల్ ఆర్డర్ కాలపరిమితి కేవలం 45 రోజులు ఉండగా సింగరేణిలో ఇది 90 రోజులుగా ఉందని పేర్కొన్నారు. ఎవరైనా వినియోగదారులు ఈ కాల పరిమితిని ఇంకా పెంచమని సమంజసమైన కారణం చూపితే వారికి మరో 90 రోజుల పాటు సేల్ ఆర్డర్( కాల పరిమితిని పెంచే వెసులుబాటును కలిగిస్తున్నామన్నారు. ఈ సౌకర్యం కోల్ ఇండియాలో లేదని తెలిపారు.ఎవరైనా ఈ-వేలం వినియోదారుడు బొగ్గు తీసుకుంటున్న క్రమంలో సేల్ ఆర్డర్‌ను రద్దు చేసుకోవాలి అనుకుంటే ఆన్‌లైన్ ద్వారా ఆ విషయాన్ని తెలియజేస్తే , రద్దు ప్రక్రియకు అంగీకరించటమే కాక వెంటనే సంబంధిత బొగ్గు డిపాజిట్ ను వెనక్కి చెల్లిస్తామని వెల్లడించారు.సింగరేణి బొగ్గుని వినియోగిస్తున్న సుమారు 80 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమావేశంలో మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జి.దేవేందర్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎన్.వి. రాజశేఖర్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవివాస్తవ తదితరులు పాల్గొన్నారు.





## సీసీ రోడ్డు పనులు పరిశీలన: డిఈ మహేష్

**తెలంగాణ వీణ, మల్కాజిగిరి..** మౌలాలి హనుమాన్ నగర్ లో గత కొంతకాలంగా నిలిచిపోయిన సిసి రోడ్ పనులను ప్రారంభించారు. మంగళవారం జరుగుతున్న పనులు మున్సిపల్ డి ఈ మహేష్, బిజెపి నేత మోహన్ యాదవ్ పరిశీలించారు. డిఈ మహేష్ మాట్లాడుతూ జరుగుతున్న రోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించిన. పనుల త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు రాకేష్, కిరణ్, శేఖర్, సంతోష్ గుప్తాలు పాల్గొన్నారు.

## పాండురంగ ఆశ్రమంలో 93వ ఆషాడ ఉత్సవాలు



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా :** మర్కుక్ మండలం భవనందాపూర్ గ్రామంలో శ్రీ పాండురంగ ఆశ్రమంలో 93వ ఆషాడ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ పెద్దలు నిశ్చయించుకున్నారు. పాండురంగశ్రమంలో ఆశాడ రాతోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పుణ్యాహవాచనం గురు ప్రార్ధన అనంతరం అఖండ నామస్మరణకు అంకురార్పణ చేశారు. శ్రీ రుక్మిణి పాండురంగ స్వామికి గోక్షిరాభిషేకం పురుష సూక్త పారాయణాలతో నిర్వహించారు. సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా రామాజీపేటకు చెందిన విధు మౌళి శాస్త్రి భక్త బృందంచే చక్రిభజన కనుల పండుగగా సాగింది. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి 17వ తేదీ రోజున తొలిఏకాదశి పురస్కరించుకొని స్వామివారికి విశిష్ట పూజలు అఖండ భగవనామము కార్యక్రమాలు జరుగుతాయని,18వ తేదీ రోజున ద్వాదశి అన్నపూజ అఖండ అన్నప్రసాద ఉతరణ కార్యక్రమం జరుగును అని ఆశ్రమ యజమానులు పూజారులు తెలిపారు.ం

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ మధుకర్ రెడ్డి

**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మర్కుక్ ఎస్ ఐ మధుకర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం లోని వివిధ గ్రామాల్లో యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి సరదాగా మొదలయ్యే అలవాటుతో చివరికి బానిసలుగా మరి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత తల్లిదండ్రులు కూడ తమ పిల్లల నడవడికను అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. 15 సం,,రాల నుంచి 25 సం,,రాల లోపు ఉన్న యువత ఎక్కువగా మత్తుకు ఇతర అలవాట్లకు బానిసవుతున్నారని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించిన,సేవించిన తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ద్విచక్ర వాహనం పై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల యువతను హెచ్చరించారు. చిన్నపిల్లలపై లైనిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం అని మండల ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని విలేకరుల సమక్షంలో తెలియజేరు.



# ఓయూ ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్మెంట్ విద్యార్థులకు బ్యాంకింగ్ ఉద్యోగాలు..

**- విద్యార్థులను, అధ్యాపకులను అభినందించిన ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ..**



**తెలంగాణ వీణ,ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్మెంట్ లో 17 మంది విద్యార్థిని, విద్యార్థులకు హెచ్డిఎఫ్సి బ్యాంకింగ్ రంగంలో మేనేజర్ స్థాయి ఉద్యోగాలు రావడం గర్వించదగ్గ విషయమని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వీరికి అత్యధికంగా సంవత్సరానికి ప్యాకేజీ రావడం సంతోషకరమన్నారు.ఈ సందర్భంగా హెచ్డిఎఫ్సి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆరుగురు మేనేజర్లు పాల్గొని 17 మంది విద్యార్థులకు ఓయూ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. ఎంబీఏ కాలేజ్ ప్రిన్సిపల్, సీనియర్ ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ తమ కాలేజీలో 4వ సెమిస్టర్ చదువుతున్న 120 మందికి గాను 109 మంది విద్యార్థులకు వివిధ పేరున్న కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయని ఈ నెలాఖరు కల్లా మరో 10 కంపెనీలు రాబోతున్నాయని 100 శాతం ప్లేస్మెంట్స్ పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రిటన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, ఫైనల్ ఇంటర్వ్యూ ల తర్వాత తమ విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారని పేర్కొన్నారు. ప్లేస్మెంట్ సాధించిన విద్యార్థులందరిని ఓయూ రిజిస్ట్రార్ తో పాటు అధ్యాపకులు అభినందించారని చెప్పారు. ఓయూ ఖ్యాతిని పెంపొందించేలా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న టీచర్లను రిజిస్ట్రార్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.డిపార్ట్మెంట్ డీన్ ప్రొఫెసర్. వెంకటయ్య, హెచ్ ఓ డి ప్రొఫెసర్ సుధా, చైర్మన్ స్మిత, ప్లేస్మెంట్ ఆఫీసర్ జహంగీర్, డా. విద్యాసాగర్ రావు, డా. సమున్నత తో పాటు హెచ్డిఎఫ్సి ప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు సైనికుల్లగా పనిచేయాలి




**తెలంగాణ వీణ,కోరుట్ల, జులై 16:** మెట్ పల్లి పట్టనంలోని నరేందర్ రెడ్డి గార్డెన్ లో జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది ఈ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పైడి పెల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు పల్లె గంగరెడ్డి మరియు గద్దె భూమన్న వెంకట రమణి లు హాజరు అయ్యారు ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి మొన్న ఎంపీ ఎలక్షన్లో ఎంపీ సీట్లు గెలిపించుకోవడం సంతోషకరమని గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా 45 నియోజకవర్గంలో ముందంజలో ఉందని వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని బిజెపి ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రతి బిజెపి కార్యకర్త సైనికులుగా పనిచేసి మన కార్యకర్తలను గెలిపించాలని అన్నారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర బిజెపి కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి కావడం దేశ ప్రజలు ఆనందంతో ఉన్నారని భారతదేశం సంక్షేమంలో ముందుకు పోతుందని.అలాగే గత తెలంగాణ ప్రభుత్వం ధనిక తెలంగాణను కెసిఆర్ ప్రభుత్వం అప్పులపాలు చేసిందని అందుకే ప్రజలు తిరస్కరించారని ఆరు గ్యారెంటీలతో మోస పూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వాటిని అమలు చేయడం లేదని దీనికోసం బిజెపి ప్రతి కార్యకర్త పోరాడాలని పించన్ల పెంపు నూతన పింఛన్లు యువతకు 2500 పింఛన్ మంజూరు హామీ తుంగలో తొక్కారని, రైతు భరోసా, రుణమాఫీ అని రేషన్ కార్డు సాకు చూపించి రైతు లబ్ధిదారులకు మోసం చేశారని కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలు తులం బంగారం 18 సంవత్సరాల యువతీకి స్కూటీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఇలా చెప్పుకుంటూ పోతే మోసాల ప్రభుత్వం హామీలతో గెలిచి ప్రజలను దగా చేశారని కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం,విద్యుత్తులో కుంభకోణం జరిగింది అని తెలిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుంట లేదని దీనిపై చర్యలు తీసుకోలేకనే లోపాయి కారు ఒప్పందలు చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె గంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పడిపల్లి సత్యనారాయణ గద్దె భూమన్న వెంకటరమణి , వద్దేపల్లి శ్రీనివాసన్ ,చెట్ల పెల్లి సుఖేందర్ గౌడ్ జనరల్ సెక్రెటరీ యాదగిరి బాబు మధుకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ భోగ శ్రావణి, బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, రుద్ర శ్రీనివాస్, కన్న అంజయ్య, పిల్లి శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, ఎర్ర లక్ష్మి, భాగ్యలక్ష్మి, గోపాల్ రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్, ధోనికెల నవీన్ ,గుంటుక సదాశివ్, విజయ్, నరేష్ ,శ్రీకాంత్, క్రాంతి జిల్లా మండల పట్టణ నాయకులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు ట్రేడ్ యూనియన్‌లపై అవగాహన అవసరం

**- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**
**- మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సమస్యలపై లోతైన అధ్యయనం జరుగుతోంది**
**- త్వరలో ఆరోగ్య కార్డులు**




**తెలంగాణ వీణ,హైదరాబాద్:** విలేకరులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, ట్రేడ్ యూనియన్ విది విధానాలపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ సూచించారు. మంగళవారం నాడు యూనియన్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా శాఖ మరియు కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ల నేతృత్వంలో శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్ లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశం లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ లో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాద్యులను జర్నలిస్టులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో విలేకరుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక అనేక ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జర్నలిస్టుల గొంతుకగా పోరాటం చేస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డికి ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ పదవిని అప్పగించడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేసిందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విలేకరుల సమస్యలపై తరచుగా సమావేశాలు, చర్చలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జర్నలిస్టులు ఆరోగ్య పథకాన్ని కోల్పోవడంతో, సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హుడైన ప్రతి విలేఖరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందని, అయితే మార్కెట్లో విచ్చలవిడిగా ఎవరికి పడితేవారికి అక్రిడిటేషన్లు దొరకడం విచారకరమన్నారు. నికార్సైన జర్నలిస్టులు మార్కెట్లో అంగడి సరుకుగా మారిన అక్రిడిటేషన్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ మండల జిల్లా కేంద్రాలుగా పరిగణలోకి తీసుకుంటూ ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. గతంలో ఓ సంఘం ప్రభుత్వం తమ జేబులో ఉందని చెప్పుకుంటూనే జర్నలిస్టులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయనప్పటికీ పాలాభిషేకాలు చేస్తూ లేనిపోని భ్రమలను కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సం ఘాలతో జర్నలిస్టులు అప్రమత్తంగాఉండాల్సినఓఅవసరం ఉందన్నారు.

### టియుడబ్ల్యూజె నూతన కమిటీకి సన్మానం

టీయూడబ్ల్యూజే నూతన రాష్ట్ర కమిటీ లో గ్రేట్ హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జర్నలిస్టు నాయకులను ఈ సందర్భంగా సన్మానించారు. కోశాధికారిగా ఎన్నికైన మోతే వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, అయితే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, గౌస్ మొయినుద్దీన్, అనిల్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా, ప్రధాన కార్యదర్శి అశోక్, హెచ్ యు జే అధ్యక్షులు శిగ శంకర్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, మామిడాల రవీందర్ రెడ్డి, సలీం పాషా, తొట్ల పరమేష్, మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షత వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి కరీం, రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐపీఎస్ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన....

**■ ఐపీఎస్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్**

**తెలంగాణ వీణ,జులై 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతే దేశానికి వెన్నుముక అని, దేశంలో 75 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. ఆహారం ఉత్పత్తికి రైతులు పడే శ్రమను ప్రత్యక్షంగా చూసేందుకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఐదో తరగతి విద్యార్థులు మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి పొలం బాట పట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ మాట్లాడుతూ, పుస్తకాలతో కుస్తీ పట్టి, ఆ తరగతి గదులకే పరిమితం కాకుండా, వ్యవసాయ జీవనం, తమ ప్రాంతంలో పండే పంటలను విద్యార్థులకు వివరించడానికి, క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడానికి పంట పొలాలకి తీసుకెళ్లామని, ఈ రోజుల్లో పిల్లలకు వ్యవసాయం పట్ల అవగాహన లేకుండా పోతుందని, పిల్లలకు ప్రత్యక్షంగా వరి నాటు వేసే విధానాన్ని చూపించడానికి తీసుకొని రావడం జరిగిందని అన్నారు. వ్యవసాయంపై విద్యార్థి దశ నుంచి అవగాహన ఉండాలని అన్నారు. విత్తనాలు చల్లి వరి నాటు నుండి పంట చేతికి ఎలా వస్తుందో విద్యార్థులకు వివరించామని అన్నారు. విద్యార్థులు పొలంలో స్వయంగా నాట్లు వేశారు. రైతులు పడే కష్టాన్ని అడిగి తెలుసు కున్నారు విద్యార్థిని క్రితిక మాట్లాడుతూ, రైతులు, మా తల్లిదండ్రులు మనం రోజు తినే అన్నం కొరకు పంట పొలాల్లో ఎలా కష్టపడుతున్నారు, మనం తినే అన్నం ఎలా వస్తుంది అనే విషయంపై మా ఐపిఎస్ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన ప్రోగ్రాం వలన తెలుసుకున్నామని, స్కూల్ యాజ మాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసిన ర్యాల రాజేందర్ యాదవ్



**తెలంగాణ వీణ/తార్నాక:** బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ర్యాల అడవయ్య యాదవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలగూడ ధోబిఘాట్ లోని అమ్మవారి ఆలయంలో మరమ్మత్తు పనుల నిమిత్తం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ర్యాల రాజేందర్ యాదవ్ రూ.20 వేల విరాళాన్ని క్రాంతి రజక సంఘము ప్రతినిధులకు సోమవారం అందజేయడం జరిగింది. కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు అభివృద్ధి పనుల్లో భాగంగా నగదును అందించడం జరిగిందని, సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు ఆలయాలను అభివృద్ధి చేయాలన్నది ట్రస్ట్ ప్రధాన ఉద్దేశ్యమని ర్యాల రాజేందర్ యాదవ్ అన్నారు. తమ తండ్రి ర్యాల అడవయ్య అందించిన స్ఫూర్తితో సేవ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు రాజేందర్ యాదవ్ తెలిపారు. అడిగిన వెంటనే అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించిన ర్యాల రాజేందర్ యాదవ్ కు రజక సంఘము ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘము అధ్యక్షుడు ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి రమేష్, సంఘము ప్రతినిధులు వెంకటేష్, శంకర్, గౌరయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యలపై అఖిల పక్షం సమావేశం నిర్వహించాలి

**- సీఎం రేవంత్ రెడ్డికీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు లేఖ**



**తెలంగాణ వీణ /సిద్దిపేట్ జిల్లా :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ భార్గవాపురం నియోజకవర్గం పోస్టాఫీస్ కార్యాలయం నిరుద్యోగ సమస్యపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అయన సీఎం రేవంత్ రెడ్డికీ లేఖ రాశారు. అనంతరం మాట్లాడుతూ నిరుద్యోగుల పై ప్రభుత్వ నిర్బంధం సరికాదని, డిమాండ్లను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అయన కోరారు. గ్రూప్ - 1లో 563 నుంచి 1,600కు పోస్టులను పెంచాలని, గ్రూప్ - 2లో 780 నుంచి 2,000వరకు పోస్టులు పెంచాలని, అలాగే గ్రూప్ - 3 పోస్టులను 1, 100 నుంచి 3 వేలకు పెంచాలని కోరారు. టీచర్ పోస్టులను కూడా 11 వేల నుంచి 25 వేలకు పెంచాలని, డీఎస్సీ పరీక్షలను రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు నమిలికోండ ఐలయ్య, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**యాదగిరిగుట్ట పట్టణంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు.నియోజకవర్గనికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులల్లో గతంలో కొద్ది మందికి పంపిణీ చేయగా మిగిలిన 8మంది లబ్ధి దారులైన దశరథ,ప్రేమలత,జాను,వెంకట్ రెడ్డి,సుభద్ర,అంతయ్య,గాళ్ రెడ్డి,లకు ఈరోజు చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# తుర్కపల్లిలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య







**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పర్యటించారు.తుర్కపల్లి మండలం బద్దు తండ గ్రామంలో వాటర్ ప్లాంట్ ని ప్రారంభించారు.అనంతరం సిత్లా పండుగ సందర్భంగా బంజారాలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారూ.ఆతర్వాత తిరుమలపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలన్నిటిని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని కోరారు.అనంతరం గంధమల్ల గ్రామంలో గంధమల్ల నుండి భువనగిరి వరకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించి ప్రారంభించారు.ఆ తర్వాత కొద్దిదూరం వరకు బస్సులో ప్రయాణించారు. అంతకుముందు వాటర్ ప్లాంట్ ని ప్రారంభించారు. మీప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన నీటిని తాగాలని ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

# విద్యా దానం చాలా గొప్పది: రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్....

**- కంటెస్టడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి పిల్లలకు స్టేషనరీ పంపిణీ**



**తెలంగాణ వీణ/తార్నాక:** బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్ట కమ్యూనిటీ హాల్లో మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు బ్లాక్ బోర్డ్లు, నోట్ పుస్తకాలు, పలకలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్. కె. లక్ష్మణ్ విచ్చేసి వారి చేతుల మీదగా టీచర్లకు విద్యార్థి విద్యార్థులకు పరికరాలను అందించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో విద్యను అందించడం నరేంద్ర మోడీ ప్రధాన లక్ష్యం అన్నారు. పేదలను ఉన్నత స్థాయికి తీసుకుపోవడానికి విద్య ఎంతో అవసరమన్నారు. ఉచితంగా పాఠశాలలకు అవసరమైన పరికరాలను బ్లాక్ బోర్డులను పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులను ఉచితంగా అందించిన మేకల కీర్తి హర్ష కిరణ్ ను అభినందించారు. పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని దానికి అధ్యాపకులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి డాక్టర్ అబ్దుల్ కలాం మార్గంలో నడవాలని వారి స్థానానికి ఎదగాలని లక్ష్మణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యకు ఎన్నో పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నారు. వాటిని వినియోగించుకోవాలని కోరారు. కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ మాట్లాడుతూ పేద ప్రజలను నిరంతరం సేవ చేయాలని లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నానని, నేటి బాలలే రేపటి పౌరులని వారు ఉన్నత స్థానానికి ఎదిగే విధంగా విద్యను అభ్యసించి వారి భవిష్యత్తు మంచి నడవడికకు ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ చదువుకొని భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడాలని మేకల కీర్తి అన్నారు. ఈ కార్యక్రమానికి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి,కనకట్ల హరి, నాగేశ్వర్ రెడ్డి, సీతాఫల్మండి డివిజన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు, శారదా మల్లేష్,అంబాల రాజు, వేణు యాదవ్, పోచయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, ప్రకాష్ గౌడ్, వీరన్న, ఆకారం రమేష్,, అనిత, అనూష,నాగరాణి, లత, ,గంగ,సరోజ, రాము వర్మ , ఓంప్రకాష్, సత్యనారాయణ, కొమురయ్య, శ్యామ్ ముదిరాజ్,, లడ్డు,నీలం శ్రీనివాస ముదిరాజ్,సేతు మహేష్,రాజేష్ నాయర్, యూద్దావీర్, రాజేష్ ముదిరాజ్,బిక్షపతి,సాయి యాదవ్, సతీష్, నర్సింహా, డాక్టర్ ఆనంద్, రాజ్ కుమార్ నేత పాల్గొనటం జరిగింది.

# ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడండి: మంత్రి శ్రీధర్ బాబు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు స్పందించక పోవడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు, చుట్టూ ఉన్న ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములను కబ్జాదారులు చెరబట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉన్నతాధికారులకు ఆయన ఒక లేఖ రాశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి ఫిర్యాదుతో మంత్రి అధికారులను అప్రమత్తం చేసారు. ఆమె ఫిర్యాదును ప్రస్తావిస్తూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్ మెంటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ, హెచ్ ఎండీఏ కమిషనర్లకు శ్రీధర్ బాబు ఈ లేఖను రాశారు. ఖానామెట్ రెవిన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 41/14 లోని 252.24 ఎకరాల భూమి ఉండగా 2008లో అప్పటి ప్రభుత్వం 180.13 ఎకరాలను హుడా (ప్రస్తుత హెచ్ ఎండీఏ) కు కేటాయించింది. అందులో నుంచి 75 ఎకరాలను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ( ప్రస్తుత టిజిఐఐసి) కు హుడా బదిలీ చేసింది. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టిజిఐఐసి యాజమాన్యంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని 100, 101 సర్వే నంబర్లలోని



100 ఎకరాల భూమిపై కబ్జా యత్నాలు జరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రజావసరాలకు ఉపయో గపడాల్సిన విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఉన్నతా ధికారులు ప్రణాళిక రూపొందించి తక్షణం కార్యరంగంలోకి దిగాలని సూచించారు. నిర్దిష్ట కాలవ్యవధిలో సమీక్షలు నిర్వహించి క్షేత్ర స్థాయి సిబ్బందికి బాధ్యతను నిర్దేశించాలని శ్రీధర్ బాబు చెప్పారు. ఆక్రమణల సమాచారం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహా రించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# బ్యాంకు మేనేజర్ రూ. కోటి... కుచ్చుటోపి

**- ఖాతాదారుల వద్ద అప్పులు చేసి...**
**- ఉడాయించిన ఇచ్చిన వైనం..- బాధితుల లబోదిబో.. - సుమారు 16 మంది బాధితులు బ్యాంకును ఆశ్రయించిన వైనం**

**తెలంగాణా వీణ, హైదరాబాద్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కొందరి వద్ద సీనియర్ బ్యాంకు మేనేజర్ అని.. మాయమాటలు చెప్పి.... సుమారు కోటి రూపాయలు వరకు అప్పులు చేసి కుచ్చుటోపి వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ నగరంలోని శివాజీ నగర్ ప్రాంతంలో గల యూనియన్ బ్యాంక్ లో రెండు సంవత్సరాల నుంచి అజయ్ సీనియర్ బ్యాంక్ మేనేజర్ గా విధులు నిర్వ ర్తిస్తున్నాడు. సీనియర్ బ్యాంక్ మేనేజర్ గా పలు వ్యాపారులతో, వినియోగ దారులతో పరిచయాలు పెంచుకున్నాడు. వారికి మాయ మాటలు చెప్పి సుమారు 16 మంది వద్ద రూ.60 లక్షల నుండి 1.కోటి వరకు కొందరికి చెక్కుల ఇచ్చి. మరికొందరి వద్ద ప్రాంసరి నోటరీ రూ పంలో అప్పులు చేసి పరారైనట్లు సమాచారం. ఈ విష యం కాస్త దావనంలా వ్యాపించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

**న్యాయం చేయాలని బ్యాంకును ఆశ్రయించిన బాధితులు..**




యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ చేతిలో మోసపోయిన బాధితులు న్యాయం చేయాలని శివాజీ నగర్ ప్రాంతంలో గల యూనియన్ బ్యాంకు ని ఆశ్రయించారు. సుమారు 16 మంది బాధితులు యూనియన్ బ్యాంకు లో ఉద్యోగులతో తమ బాధను మొర పెట్టు కున్నారు. కొందరికి రుణాలు ఇచ్చినట్టు చెక్కులు, మరికొందరికి ప్రాంసరీ నోటులు ఇచ్చినట్లు బాధితులు వాపోయారు. సీనియర్ బ్యాంక్ మేనేజర్ తీసుకున్న అప్పుకు బ్యాంకుకు ఏలాంటి సంబంధం లేదని యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు తెల్పి చెప్పారు. మీరు ఇచ్చిన అప్పు విషయమై న్యాయం కావాలంటే పోలీస్ స్టేషన్ ని ఆశ్రయించాలని చెప్పారు.

**ఈ ఘటనపై గత రెండు రోజులుగా బ్యాంకులో ఆడిట్ చేస్తున్న వైనం...**

నిజాంబాద్ నగరంలోని శివాజీ నగర్ బ్రాంచ్ ..యూనియన్ బ్యాంకులో జరిగిన ఘటనపై... గత కొన్ని రోజులకు బ్యాం కులో ఆడిట్ జరుగుతుంది. ఇతరుల వద్ద సీనియర్ మేనేజర్ అప్పు చేయడమే కాకుండా... బ్యాంకు సంబంధించిన లావా దేవీలలో ఏదైనా గోల్మాల్ జరిగిందో... అనే కోణంలో ఆడిట్ చేస్తున్నారు. రెండు రోజు లుగా బ్యాంకులో అన్ని రికార్డులను పరిశీలిస్తున్నారు.

**బాధితులకు న్యాయం జరిగేనా?**

ఇంత జరుగుతున్న బాధితులు తమకు జరిగిన అన్యాయంపై ఎక్కడా కూడా పోలీ స్ స్టేషన్లో ఫిర్యాదు చేయకపోవడం ఆశ్చ ర్యానికి గురిచేస్తుంది. కానీ న్యాయం చేయాలని బ్యాంకును మాత్రం ఆశ్రయిం చారు. అసలు సీనియర్ మేనేజర్ కోటి రూపాయలు వరకు అప్పు చేయడంలో అంతర్యం ఏమిటో?...... మోసం చేసిన సదరు సీనియర్ బ్యాంకు మేనేజర్ పై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేనా వేచి చూడాల్సిందే.

# నిరుద్యోగుల అరెస్టు సబబు కాదు - నేషనల్ బంజారా మిషన్

**తెలంగాణవీణ, కీసర:** రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన గ్రూప్-2, 3 పరీక్షలను వాయిదా వేయాలని నేషనల్ బంజారా మిషన్ ఇండియా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు. పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం సరైన చర్య కాదని విమర్శించ్నా. రాష్ట్రంలో గ్రూప్-2, 3 పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని వారిపట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి, వారితో చర్చించి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలను ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించనున్నారని.. ఇప్పటికే ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లు జారీ అయ్యాయని గుర్తు చేశారు. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను రాసే అభ్యర్థుల్లో డీఎస్సీ అభ్యర్థులు కూడా ఎక్కువగా



ఉన్నారని ఆగస్టు 5 వరకు డీఎస్ సీ పరీక్షలు రాసి.. వెంటనే ఆగస్టు 7,8 తేదిల్లోనే గ్రూప్-2 పరీక్షలకి హాజరు కావడమంటే కష్టంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను నెల రోజులు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీ సిలబస్ వేరు.. గ్రూప్స్ సిలబస్ వేరు కాబట్టి కాబట్టి ప్రభుత్వం ఈ సున్నితమైన సమస్యపై అభ్యర్థులతో చర్చించి సానుకూలంగా పరిష్కారం చేయాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన గ్రూప్-1 పోస్టుల కంటే అదనంగా 63 పోస్టులను పెంచి మళ్లీ గ్రూప్-1 నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2, గ్రూప్-3లలో పోస్టులను పెంచే ఆలోచనను పరిశీలించి పోటీ పరీక్షలను నిర్వహించాలన్నారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని, గ్రూప్స్ పరీక్షలను నెల రోజులు వాయిదా వేయాలని రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు.

# నాగారం మున్సిపల్‌లో ఆగని అక్రమ నిర్మాణాలు ..

**తెలంగాణవీణ, కీసర:** నాగారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలు చేపడుతున్నారు. బారీ షెడ్లతో పాటు ఆదనపు అంతస్తుల నిర్మాణాలు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల సెల్లార్ నిర్మాణాలతో పాటు పలు షెడ్లను అధికారులు కూల్చివేశారు. కాగా నేషనల్ మార్టు ఎదురుగా షెడ్లు, భవన నిర్మాణపనులను చేపడుతున్నా ఇటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టే అధికారులు కొన్ని నిర్మాణాలపై మాత్రమే చర్యలు చేపట్టి చేతులు




దులుపుకుంటున్నారనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యమ నేత, బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి జోగు శ్రీనివాస్ కురుమకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు



**తెలంగాణ వీణ,మల్కాజిగిరి:** తెలంగాణ ఉద్యమ నేత బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి జోగు శ్రీనివాస్ కురుమ జన్మదిన పురస్కరించుకొని మంగళవారం మౌలాలి డివిజన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్ కూడా బిసి భవన్ లో జోగు శ్రీనివాస్ కురుమకు సంఘం బీసీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, పిసి నాయకులు పూలపల్లి సుందర్ యాదవ్, ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, కరణం గోపి కార్యదర్శులు చేగోరి రామ్మోహన్ కుర్మా, కాసర్ల నాగరాజు పిట్టల భాస్కర్, నాయకులు పరంధాములు, జోగు కుమారస్వామి కురుమ, పేపర్ శ్రీనివాస్ దశరథ్ లక్ష్మీనారాయణ ఇతరులు పాల్గొన్నారు.



## ఇంజనీరింగ్, శానిటైజషన్ అధికారులు సమన్వయముతో పనిచేయాలి

**- మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రావణ్**

**తెలంగాణవీణ, మల్కాజ్గిరి:** ఇంజనీరింగ్ శానిటైజషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్, శివపురిలోని తన కార్యాలయంలో ఇంజనీరింగ్ ,శానిటైజషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూపలు ప్రదేశాలలో రోడ్డు, నాలా పనుల వ్యర్థాలు గూట్టేదారులు తొలిగించకపోవడంతో పారశుధ్య సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని తొలగించాలని సూచించారు.మారుతి నగర్,సరికొండ నర్సింహ రెడ్డి గార్డెన్స్ వద్ద వున్న వ్యర్థలను వారం రోజుల్లో తొలగించి నాలా కంచెను ఏర్పాటు చెయ్యాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ సిబ్బంది రమేష్, దీపక్,గిరి, అంజి, మాజీ కౌన్సిలర్స్ ఆనంద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు, షెడ్లు





**తెలంగాణ వీణా/కుత్బుల్లాపూర్:** దుండిగల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. జిహెచ్ఎంసి పరిధిలో కొనసాగుతున్న నిర్మాణాలపై చర్యలు శూన్యం అధికారుల నిర్లక్ష్యంతో జంట సర్కిల్ పరిధిలో 2 ,మూడు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకుని ఐదు, ఆరు అంతస్తులు నిర్మించడం ఒక ఎత్తు అయితే షెడ్ నిర్మాణాలు రోజు రోజుకి విపరీతంగా పెరుగుతున్నాయి.1 కుత్బుల్లాపూర్ దుండిగల్ మున్సిపల్ పరిధిలో నూతన అక్రమ నిర్మాణాల తో పాటు భారీ షెడ్ లను విచ్చలవిడిగా నిర్మిస్తున్నారుఆయా నిర్మాణాలపై పత్రికలలో వచ్చినప్పుడు ప్రజల నుండి ఫిర్యాదులు అందినప్పుడు అధికారులు హడావుడి చేసి పాక్షికంగా కూల్చి వేతలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అదేవిధంగా ప్రజా ప్రతినిధులు అండదండలు అక్రమార్కులకు దండిగా ఉండటం వలన వారి నుండి వచ్చే ఒత్తిళ్లకు సైతం అధికారులు లుంగి ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. దుండిగల్లో సదరు నిర్మాణాలకు అనుమతులు ఉన్నా లేకపోయినా కౌన్సిలర్ లు చెప్పిందే వేదంగా పరిస్థితి ఏర్పడింది.ద

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**తెలంగాణవీణ, కూకట్ పల్లి:** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు కే పి హెచ్ బీ లోని మండల కార్యాలయంలో, కూకట్ పల్లి నియోజకవర్గంకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, మొత్తం 235 మంది లబ్ధిదారులకు,ఒక్కొక్కరికి రూపాయలు లక్ష నూట పదహారు రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, పండాల సతీష్ గౌడ్, ముద్దం నర్సింగ్ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, సబేహా గౌసుద్దీన్, పి.శిరీషా బాబు రావు, మహేశ్వరీ శ్రీహరి లు పాల్గున్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్ బన్నాల

**తెలంగాణ వీణ, ఉప్పల్:** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ దంపతులు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కేటీఆర్ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ దంపతులతో మాట్లాడుతూ మన ప్రభుత్వం లేదని బాధపడాల్సిన అవసరం లేదని అనునిత్యం ప్రజలతో ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మానెనాలు పొందాలని అన్నారు.కేటీఆర్ ను కలిసిన వారిలో ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**- అందజేసిన తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్**



**తెలంగాణ వీణ, సిద్దిపేట జిల్లా :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో బొడ్డు బాలమల్లు అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మర్కుక్ మండల తొలి ఎంపీపీ తండా పాండు గౌడ్ మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు, కరుణాకర్, మ్యాకల శ్రీనివాస్, బొడ్డు స్వామి, ఎల్లం మధు, సంతోష్, మహేష్ రమేష్, బొమ్మ యాదగిరి, వెంకటేష్ తదితరులు వున్నారు.

## ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికావృద్ధి సాధించాలి

**- మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి**




**తెలంగాణవీణ, కీసర :** ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలలకు రాబోయే ఐదేళ్లలో సంవత్సరానికి రూ. 1000 కోట్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో రూ. 5000 కోట్లతో మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్.పిలతో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఆర్.పి లు అందరూ కూడా స్వయం సహాయక సంఘాల మహిళలతో గ్రూప్సగా ఏర్పడి, కాంటీన్స్, స్టిచ్చింగ్ యూనిట్స్, పిండి వంటల తయారీ వంటి యూనిట్స్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.కమిషనర్ రాజేందర్ కుమార్, మేనేజర్ కె.చంద్రశేఖర్,మెప్మాఏపీఎం నరసింహ, ఆర్.పి లు పాల్గొన్నారు.

## సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్**

**తెలంగాణ వీణ, మల్కాజిగిరి:** వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ ,మలేరియా, చికెన్ గున్యా, వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ తెలిపారు.ఓల్డ్ సఫిల్ గుడా లోని ప్రభుత్వ పాఠశాలలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పిల్లలు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలంటే ఇంట్లో ఉన్న పాత టైర్లు, కొబ్బరి బోండాలు ,పూల కుండీలలో నిలువ ఉన్న నీటిలో లార్వా పెరుగుతుంది.ఇదే దోమగా మారుతుందని, డెంగ్యూ , మలేరియా,చికెన్ గున్యా లాంటి వ్యాధులు వస్తాయని డెంగ్యూ ప్రాణాంతకం అయిందని , మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించండి పిల్లలను కోరడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు..ప్రతి ఆదివారం మీ ఇంటి ఆవరణలోలార్వా లేకుండా చూడమని పిల్లలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,DE వనజ,,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**తెలంగాణవీణ, కూకట్ పల్లి..** కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 2002-2003 విద్యాసంవత్సరంలో,పదవ తరగతి పూర్తి చేసుకున్న ,పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం మూసా పేట్ లోని దేవి గ్రాండ్ హోటల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు, కూకట్ పల్లి హై స్కూల్ లో చదువుకున్న రోజుల్లోని గత జ్ఞాపకాల్ని గుర్తుకొస్తున్నాయి అంటూ నెమరేసుకుని,పాఠశాల స్థాయి విద్యనభ్యసించే రోజులే రోజులని ఆ విలువైన రోజులు మళ్ళీ రావని విద్యార్థులు తమ మనసులోని మాటలను వ్యక్తపరిచారు,ఈ సందర్భంగా తమ గురువులను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్న పూర్వ విద్యార్థులు.



## అవాలతో విష్ణు భగవాన్ అద్భుత చిత్రాన్ని రూపొందించి భక్తిని చాటుకున్న రామకోటి రామరాజు

**తెలంగాణ వీణ/ సిద్దిపేట జిల్లా :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని విష్ణు భగవాన్ అద్భుత చిత్రాన్ని అవాలను ఉపయోగించి 3రోజులు శ్రమించి అద్భుతంగా రూపొందించి మంగళవారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి భక్తిని చాటుకున్న శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రాష్ట్రస్థాయి కళారత్న, భక్తిరత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు .ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండుగలలో తొలి ఏకాదశి పండుగ ఒకటన్నారు. తొలి ఏకాదశి రోజున భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్ష చేస్తారన్నారు. విష్ణు భగవాన్ చిత్రాన్ని భక్తులు తిలకించి అద్భుతంగా ఉందని రామకోటి రామరాజును అభినందించారు. రామకోటి వ్రాయని ఎవరన్నా ఉంటే తొలి ఏకాదశి నుండి ప్రారంభించాలని కోరారు.



## ప్రతి రైతు కుటుంబానికి ఋణమాఫీ వర్థింపచేయాలి

**- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి**

**తెలంగాణ వీణ/ సిద్దిపేట జిల్లా :** రేషన్ కార్డు ప్రమాణికంగా కాకుండా ప్రతి రైతు కుటుంబానికి 2లక్షల ఋణ మాఫీని వర్థింపచేయాలని మంగళవారం నాడు ఒక ప్రకటనలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డు ఉంటేనే 2లక్షల ఋణమాఫీ కి అర్హులని సోమవారం నాడు పంట ఋణమాఫీ పథకంబి2024 మార్గదర్శకాలను విడుదలచేసిన వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తెలిపడన్నాడు.ఇందులో ముఖ్యంగా డిసెంబర్ 12బి2018 నుండి డిసెంబర్ 9బి2023 వరకు ఈ కాల వ్యవదిలో తిసుకున్న ఋణాలు మాత్రమే మాఫీ కి అర్హులుగా రెషన్ కార్డు



లేనివారు,ప్రభుత్వ ఉద్యోగులు,ఎక్కువ మెత్తంలో అదాయపు పన్ను చెల్లించే వారికి ఈ పథకం వర్థించదని మార్గదర్శకాలలో తెలిపడన్నాడు.సిద్దిపేట్ జిల్లా 2,91,587 రేషన్ కార్డులు మాత్రమే ఉన్నయన్నాడు.జిల్లాలో కొత్తరేషన్ కార్డులు రాక దాదాపు 7,8 సంవత్సరాలు కావొస్తుందన్నాడు.ఈ మధ్య కాలంలో కుటుంబం నుండి సపరేటైన కుటుంబాలు,కొత్తగా భూమి కొనుగోలు చేసిన కుటుంబాలు దాదాపు సగానికి పైగా ఉంటాయి కాబట్టి రేషన్ కార్డు ప్రమాణికంగా మాఫీ ప్రక్రియ కొనసాగితే రైతులు చాలా వరకు నష్టపొయే అస్కారముందన్నాడు.వెంటనే ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి ఋణమాఫీ వర్థించేవిధంగా మార్గదర్శకాలలో పొందుపర్చలన్నాడు.పీఎంబికిసాన్ నిబంధనలను అమలు చేస్తే మరికొంతమంది రైతులు నష్టపొయే ప్రమాదముంది గనుక రైతులకు ఉపయోగపడే విధంగా ఋణాలను మాఫీ చేసి కి అండగా నిలువాలని కొరుతున్నాం. ఈ కార్యక్రమం లో రామయ్య,చంద్రయ్య,నారయణ,శ్రీ హరి పాల్గొన్నారు.

## బండి రమేష్ ఆధ్వర్యంలో మధు గౌడ్ పుట్టిన రోజు వేడుకలు




**తెలంగాణవీణ, కూకట్ పల్లి:** బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ పుట్టినరోజు వేడుకలు , మంగళవారం బాలానగర్ లోని పార్టీ కార్యాలయంలో సందడిగా జరిగాయి, ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్, ముఖ్యఅతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు, మధు కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రాజ్ పుత్ మల్లికార్జున యాదవ్ కుక్కల రమేష్ రమేష్ లక్ష్మణ్ అస్లాం మధురి రాము సుధాకర్ రెడ్డి ప్రసన్నకుమార్ శేఖర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన..

**- జీహెచ్ఎంసీ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు..**




**తెలంగాణవీణ, హైదరాబాద్:** అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహా వివిధ విభాగాల అధికారులకు సూచనవిపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలుపాత భవనాల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని సూచనతెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్‌లో ఇవాళ (మంగళవారం) సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఇతర విభాగాల అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురిస్తే హైదరాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే అవకాశ ఉందని, జనాలు ఇబ్బందులు ఎదుర్కనే అవకాశం ఉంటుందని, ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని మంత్రి ఆదేశించారు. నీళ్లు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిలిచిన నీటిని కాలువల ద్వారా బయటకు పంపించే ప్రయత్నం చేయాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక ప్రాణ నష్టం జరగకుండా అన్ని అప్రమత్త చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత వహించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. పోలీసులు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ విభాగాలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత భవనాల వద్ద ఉన్నవారిని ఖాళీ చేయించాలని, విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విద్యుత్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు.

## దశాబ్ది బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**తెలంగాణవీణ, కూకట్ పల్లి:** దశాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న అమ్మవారి ఆలయాలకు, చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మియపూర్ డివిజన్ మయూరినగర్ లోని శ్రీ ధ్యాన మారుతి మందిరంలో నిర్వహించడం జరుగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మరియు మియపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా పండుగలను నిర్వహించుకోవాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు బోనాల ఉత్సవాలు జరుపుకొనేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. దశాబ్ది బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కంటే ఎక్కువ ఫండ్ ను అందించడం మంచి విశేషమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాంద్రి శ్రీ కనకదుర్గ అమ్మ వారి మొక్కు ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చెల్లించుకోవడం జరిగింది



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:** శ్రీ మాధవనేని రఘునందన్ రావు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ ఎంపీ గా గెలిచినా సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు సంతోష్ గౌడ్ పాదయాత్ర విజయవాడకు చేరుకోగా విజయవాడలో ఇంద్రకీలాంద్రి శ్రీ కనకదుర్గ అమ్మ వారి మొక్కు ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చెల్లించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కూడిక్యాల రాములు, బిజెపి గజ్వేల్ పట్టణ, మార్కుక్, జగదేవపూర్, ములుగు, కుకూనూర్ పల్లి మండలాల అధ్యక్షులు సాయిరెడ్డి రాం రెడ్డి, మనోహర్ యాదవ్, దాసరి ఐలయ్య యాదవ్, మన్నే శ్రీనివాస్ ముదిరాజ్, అనుములు సంపత్ రెడ్డి, బిజెపి ప్రధాన కార్యదర్శి సదానందు గౌడ్ లు ఉన్నారు.







## 30 బంతుల్లో 30 పరుగులు.. అప్పుడు నా మైండ్ పూర్తిగా బ్లాంక్ : రోహిత్ శర్మ



**ఇంటర్నెట్ డెస్క్:** ఇటీవల ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో విజేతగా నిలిచి.. టీమ్ఇండియా సుదీర్ఘ ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చుకుంది. అయితే.. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై విజయం అంత ఈజీగా రాలేదు.చివరి వరకూ ప్రత్యర్థి జట్టుదే పైచేయిగా కనిపించింది. ఓ దశలోనైతే సఫారీలు చేయాల్సింది 30 బంతుల్లో 30 పరుగులు.. మరోవైపు క్రీజులో భారీ హిట్టర్లు. దీంతో టీమ్ఇండియా శిబిరంలో కలవరం మొదలైంది. ఆ చివరి ఐదు ఓవర్ల టెన్షన్‌ను తాజాగా సారథి రోహిత్ శర్మ ఓ కార్యక్రమంలో పంచుకున్నాడు.''అప్పుడు నా మైండ్ పూర్తిగా బ్లాంక్ అయిపోయింది. అప్పటి వరకు మ్యాచ్ బ్యాలెన్స్‌డ్‌గా ఉంది. ఎప్పుడైతే క్లాసెన్ 15వ ఓవర్‌లో దంచికొట్టాడో అంతా మారిపోయింది. ఆ సమయంలో ఎక్కువ సేపు ఆలోచించలేదు. ఆ క్షణంలో ఏం చేయాలనే దానిపైనే దృష్టి పెట్టా. ఆటగాళ్లు ప్రశాంతంగా ఉండటం.. మా ప్రణాళికలను అమలు చేయడం ఎంతో ముఖ్యం. దక్షిణాఫ్రికాకు 30 బంతుల్లో 30 పరుగులు అవసరమైనప్పుడు మేం ఎంతో ఒత్తిడిలో ఉన్నాం. అయితే.. చివరి ఐదు ఓవర్లు బౌలింగ్ చేసిన తీరు చూస్తే మేం ఎంత ప్రశాంతంగా ఉన్నమో తెలుస్తుంది. మేం చేయాల్సినదానిపైనే దృష్టి పెట్టాం. మిగతా వాటిపై ఎక్కువగా ఆలోచించలేదు. భయానికి గురి కాలేదు. అప్పుడు మా జట్టు ప్రవర్తించిన తీరు బాగుంది'' అని రోహిత్ వివరించాడు.అక్షర్ పటేల్ వేసిన 15వ ఓవర్లో క్లాసెన్ వరుసగా రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టి.. మొత్తం 24 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత పేసర్లు రంగంలోకి దిగి దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. 16వ ఓవర్‌లో బుమ్రా కేవలం నాలుగు పరుగులు మాత్రమే ఇచ్చాడు. తర్వాత హార్దిక్ వేసిన 17వ ఓవర్ తొలి బంతికే క్లాసెన్‌ను ఔట్ చేసి తిరిగి టీమ్ఇండియాను పోటీలో నిలిపాడు. 19వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ కూడా నాలుగు పరుగులే ఇచ్చాడు. ఇలా ముగ్గురు పేసర్లు చివరి ఐదు ఓవర్లలో 22 పరుగులే ఇచ్చి టీమ్ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించారు.

## సొంత ఇలాకాలో పాండ్యా.. స్వాగతం అదిరిందిపో..!

పొట్టి వరల్డ్ కప్ హీరో హార్దిక్ పాండ్యా సొంత ఇలాకాలో అడుగుపెట్టాడు. బార్బడోస్ నుంచి స్వదేశం వచ్చాక ముంబైలోనే ఉండిపోయిన పాండ్యా మంగళవారం బరోడాకు వెళ్లాడు.ఊహించిన దానికంటే రెట్టింపుగా ఈ స్టార్ ఆల్‌రౌండర్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సోదరుడు కృనాల్ పాండ్యాతో కలిసి పాండ్యా ఓపెన్ టాప్ బస్సులో రోడ్ షో పాల్గొన్నాడు.ఓపెన్ టాప్ బస్సులో ఊరేగిన పాండ్యాకు జనం నీరాజనాలు పలికారు. దారి పొడవునా వరల్డ్ కప్ హీరోకు వెల్‌కమ్ చెప్తూ హార్దిక్, కృనాల్‌లతో ఫొటోలు తీసుకున్నారు. అంతమంది తనపై చూపిస్తున్న ఆదరణ, ప్రేమకు ఫిదా అయిన పాండ్యా వాళ్లకు థాంక్యూ చెప్పాడు.టీ20 వరల్డ్ కప్‌లో ఆల్‌రౌండర్‌గా విశేషంగా రాణించిన పాండ్యా.. ఫైనల్లోనూ కెప్టెన్‌తో పాటు కోట్లాదిమందిని గెలిపించాడు. 20వ ఓవర్‌లో దక్షిణాఫ్రికా విజయానికి 16 పరుగులు అవసరమైన వేళ బంతి అందుకున్న పాండ్యా.. తొలి బంతికే డేంజరస్ డేవిడ్ మిల్లర్ వికెట్ తీసి జట్టును గెలుపు వాకిట నిలిపాడు. ఒత్తిడిలోనూ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో అదరహో అనిపించాడు. అంతేకాదు ఐపీఎల్ 17వ సీజన్‌లో తనను ఛీ కొట్టిన వాళ్లకు పాండ్యా గట్టి సమాధానం చెప్పాడు.శ్రీలంకతో జరుగబోయే టీ20 సిరీస్‌కు పాండ్యా కెప్టెన్‌గా ఎంపికయ్యే అవకాశ ముంది. అయితే.. ఆగస్టు 2న మొదలయ్యే వన్డే సిరీస్‌కు అతడు దూరమవుతాడని సమాచారం. వ్యక్తిగత కారణాలతో పాండ్యా సిరీస్ నుంచి వైదొలనున్నాడని టాక్.



## రోహిత్-కోహ్లి వారసులు వచ్చేశారు: మాజీ బ్యాటింగ్ కోచ్



టీమిండియా బ్యాటింగ్‌కు మూలస్తంభాలైన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ అనంతరం మిగిలిన ఫార్మాట్లకు కూడా వీడ్కోలు పలికే ఛాన్స్ ఉంది.అయితే పుష్కర కాలం నుంచి భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న వీరిద్దరు ఒక్కసారిగా రిటైర్మెంట్ ప్రకటిస్తే జట్టు బలహీనంగా మారే అవకాశాలు ఎక్కు వగా ఉంటాయి.యువ ఆటగాళ్లు ధనాధన్ ఇన్నిం గ్స్‌లతో ఆకట్టుకుంటున్నా నిలకడగా పరుగులు చేయ డంలో విఫలమవుతున్నారు. అంతేగాక ప్రధాన టోర్నీల్లో, కీలక మ్యాచ్‌ల్లో మోస్తారు సీనియర్లు కూడా తడబడుతున్నారు. దీంతో జట్టు భారాన్ని రోహిత్-కోహ్లినే ఇప్పటికే మోస్తున్నారు. కానీ 35 ఏళ్ల కోహ్లి, 37 ఏళ్ల రోహిత్ ఎన్ని రోజులు అంతర్జాతీయ క్రికెట్ ఆడతారనే విషయంపై స్పష్టత లేదు.అయితే రోహిత్, కోహ్లి స్థానాలను భర్తీ చేయడం కష్టమే అని, కానీ వాళ్ల వారసులుగా యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్ ఎదిగే అవకాశాలు ఉన్నాయని టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నాడు. టీ20 వరల్డ్ కప్-2024 అనంతరం రాహుల్ ద్రవిడ్‌తో పాటు సహాయక సిబ్బంది కూడా కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.''రోహిత్, కోహ్లి వంటి స్టార్లను భర్తీ చేయడం అంత తేలిక కాదు. కానీ ఇటీవల ముగిసిన జింబాబ్వే సిరీస్ అనంతరం టీ20ల్లో భవిష్యత్‌కు కాస్త భరోసా దక్కిందనిపించింది. వన్డేలు, టెస్టు ఫార్మాట్‌లో ఈ భావన రావడం కోసం కొన్నేళ్ల సమయం పడుతు ంది. అయితే సంధి దశ గురించి అంతగా ఆందోళన చెందాల్సిన పనిలేదు. భారత క్రికెట్‌లో బలమైన బ్యాటి ంగ్ ఉంది. ఎంతో మంది నాణ్యమైన ప్లేయర్లు వస్తున్నా రు. అయితే వాళ్లను సరైన పద్ధతిలో తీసుకురావడమే కీలక విషయం''''శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ వంటి ఆటగాళ్లు సత్తాచా టుతారని ఆశిస్తున్నా. దీంతో పరివర్తన దశ సాఫీగా సాగుతుందని ఆశిస్తున్నా. ఇక వన్డేల్లో శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య వంటి ప్లేయర్లు జట్టులోనే ఉన్నారు. ఇక గిల్, జైస్వాల్ సుదీర్ఘ కాలంపాటు మూడు ఫార్మాట్లలో ఆడటానికి సిద్ధంగా ఉన్నారు. భవిష్యత్‌లో భారత బ్యాటింగ్‌కు వారిద్దరూ వెన్నెముకగా నిలుస్తారు'' అని విక్రమ్ రాథోర్ పేర్కొన్నాడు.



## గంభీర్ రాకతో మారిన రూల్స్: ఆ ముగ్గురు మినహా అందరూ అలర్ట్

టీమిండియా టెస్టు జట్టు ఆటగాళ్లు, ఆశావాహులు అందరినీ బీసీసీఐ అలర్ట్ చేసింది. వచ్చే నెలలో జరగనున్న దులీప్ ట్రోఫీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆదేశించింది. అయితే ముగ్గురు ఆటగాళ్లకు మాత్రం మినహాయింపు ఇచ్చిందని సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో దులీప్ ట్రోఫీకి ఎంతో ప్రాముఖ్యత ఉన్న విషయం తెలిసిందే. భౌగోళిక ఆధారంగా జోన్ల మధ్య ఈ టోర్నమెంట్ జరుగుతుంది. నార్త్, సౌత్, సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌తో పాటు నార్త్‌ఈస్ట్ జోన్ జట్లు పాల్గొంటాయి.అయితే దులీప్ ట్రోఫీకి సాధారణంగా జోనల్ సెలక్షన్ కమిటీ జట్లను ఎంపిక చేస్తుంది. కానీ ఈ సారి మాత్రం జాతీయ సెలక్షన్ కమిటీనే ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ నుంచి భారత జట్టు సుదీర్ఘంగా టెస్టు ఫార్మాట్ ఆడనుంది. ఈ నేపథ్యంలో టెస్టు జట్టులో ఉండే ఆటగాళ్లందరూ దులీప్ ట్రోఫీ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసిందని సమాచారం. ఈ నిర్ణయం వెనుక ఇటీవల టీమిండియా ప్రధాన కోచ్‌గా ఎంపికైన గౌతమ్ గంభీర్ ఉన్నాడని తెలుస్తోంది.రాహుల్ ద్రవిడ్ స్థానంలో గంభీర్ కోచ్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. జులై 27వ తేదీ నుంచి మొదలుకానున్న లంక పర్యటనతో గంభీర్ తన యాక్షన్ మొదలుపెట్టనున్నాడు. అయితే శ్రీలంక పర్యటన ముగిసిన అనంతరం టీమిండియా.. బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లు ఆడనుంది.దీన్ని దృష్టిలో పెట్టుకొని దేశవాళీ క్రికెట్‌లో భారత ప్లేయర్లు పాల్గొనేలా గంభీర్ చేస్తున్నాడు. కాగా, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రాకు మాత్రం మినహాయింపు ఇచ్చినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.''ఈ సారి దులీప్ ట్రోఫీకి జోనల్ సెలక్షన్ కమిటీ లేదు. జట్లను జాతీయ సెలక్షన్ కమిటీనే ఎంపిక చేస్తుంది.టెస్టు జట్టు పోటీదారులందరినీ ఎంపిక చేస్తారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా ఆడాలా? వద్దా అనేది వారి నిర్ణయానికే వదిలేశాం'' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.



## టెస్టు స్పెషలిస్ట్‌లు ఆ ట్రోఫీలో తప్పకుండా ఆడాలి: బీసీసీఐ

**ఇంటర్నెట్ డెస్క్:** భారత జట్టు టెస్టు స్పెషలిస్టులకు బీసీసీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టులో జరగనున్న దులీప్ ట్రోఫీకి టెస్టు జట్టు రెగ్యులర్ సభ్యులందరూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది.ప్రతి ఆటగాడు కనీసం ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు ఆడాలని ఆదేశించింది. సెప్టెంబరులో స్వదేశంలో ప్రారంభంకానున్న టెస్టు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్లు జాతీయ జట్టు విధులకు దూరంగా ఉంటే దేశవాళీ టోర్నీలకు అందుబాటులో ఉండాలని బీసీసీఐ కార్యదర్శి జై షా పేర్కొన్నారు. అయితే, స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ విషయంలో మినహాయింపు ఇచ్చారు. కీలకమైన ఈ ముగ్గురు ఆటగాళ్లు గాయాలబారినపడకుండా ఉండేందుకు ఈ మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది.''ఈ సారి దులీప్ ట్రోఫీకి జోనల్ సెలక్షన్ కమిటీ లేదు. జాతీయ సెలక్షన్ కమిటీ మాత్రమే దులీప్ ట్రోఫీ జట్లను ఎంపిక చేస్తుంది. టెస్ట్ జట్టు పోటీదారులందరినీ ఎంపిక చేస్తారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా ఆడాలా? వద్దా అనేది వారి నిర్ణయానికే వదిలేశాం'' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరులో బంగ్లాదేశ్ పర్యటనతో టీమ్ఇండియా టెస్టు సీజన్ ప్రారంభంకానుంది. భారత్, బంగ్లాదేశ్ మధ్య సెప్టెంబరు 19-23 మధ్య తొలి టెస్టు, సెప్టెంబరు 27-అక్టోబర్ 1 మధ్య రెండో టెస్టు జరగనున్నాయి. అనంతరం మూడు టెస్టుల సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం నవంబర్‌లో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది.

### ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. 12వ స్థానానికి హర్మన్‌ప్రీత్ కౌర్

ఐసీసీ మంగళవారం తాజా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానంలో నిలవగా.. ఓపెనర్ షఫాలీ వర్మ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 15వ స్థానాన్ని దక్కించుకుంది. స్మృతి మంధాన ఐదో స్థానాన్ని నిలబెట్టుకుంది. భారత్ నుంచి ఆమె టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగానికొస్తే.. దీప్తి శర్మ మూడో స్థానంలో కొనసాగుతోంది. రాధా యాదవ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకోగా.. పూజా వస్త్రాకర్ ఆరు స్థానాలు ఎగబాకి 23వ ర్యాంక్‌కు, శ్రేయాంక పాటిల్ 9 స్థానాలు మెరుగై 60వ ర్యాంక్‌కు చేరుకుంది.



# ‘బ్యాడ్‌న్యూజ్’లో హాట్ సీన్స్.. కట్ చేయాల్సిందేనన్న సెన్సార్

**ముంబయి:** ప్రేక్షకులకు ‘బ్యాడ్ న్యూజ్’ అంటూ వినోదాన్ని పంచడానికి సిద్ధమవుతున్నారు కథానాయకుడు విక్కీ కౌశల్.ఆయన, త్రిప్తి దిమ్రీ , అమీ విర్క్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. వాస్తవ సంఘటనల ఆధారంగా రానున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌ని ఆనంద్ తివారీ తెరకెక్కిస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలక్టివ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా జులై 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో సెన్సార్ బోర్డు ఈ మూవీకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది.అయితే, విక్కీ కౌశల్, త్రిప్తి దిమ్రీ మధ్య కొన్ని సన్నివేశాలు మరీ శ్రుతిమించాయని వాటికి కత్తెర వేయాల్సిందేనని సూచించింది. ముఖ్యంగా ఇద్దరి మధ్య ఘాటైన ముద్దు సన్నివేశాలు ఉండటంతో వాటిలో మూడు సీన్స్‌కు 10 సెకన్లు, 8 సెకన్లు, 9 సెకన్ల చొప్పున కట్ చేయమని చెప్పింది. అంతేకాకుండా, ధూమపానం, మద్యపానం కనిపించే సన్నివేశాల్లో అక్షరాల సైజు పెద్దదిగా కనిపించేలా ప్రదర్శించమని సూచించింది. దీంతో సినిమా మొత్తం రన్ టైన్ 142 నిమిషాలు (2 గంటలా 22 నిమిషాలు)గా తేలింది.ప్రస్తుతం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులకు వినోదాన్ని పంచే చిత్రాలు తక్కువగానే ఉన్నాయి. ఇటీవల విడుదలైన ‘సర్ఫిరా’, ‘ఇండియన్2’ పెద్దగా మెప్పించలేదు. మరోవైపు ‘కల్కి’ ఒక్కటే ప్రస్తుతం స్టడీగా వసూళ్లు రాబడుతోంది. ఈ క్రమంలో ‘బ్యాడ్‌న్యూజ్’లాంటి కామెడీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ రావడం ఆ చిత్రానికి కలిసొచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు.

# ఫొటోషూట్‌లో మరోసారి రెచ్చిపోయిన షాలిని పాండే..

షాలిని పాండే ఈ భామ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రౌడీ హీరో విజయ్ దేవరకొండ సరసన ‘అర్జున్ రెడ్డి’ లో షాలినీ పాండే నటించిన సంగతి తెలిసిందే.ఈ చిత్రంతోనే షాలినీ పాండే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఇమేజ్ ను సొంతం చేసుకుంది. అర్జున్ రెడ్డి తర్వాత షాలినీ తెలుగు, తమిళం, హిందీ లో మంచి ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఆ తర్వాత విడుదలైన సినిమాలు మాత్రం ఆశించిన విజయం అందించలేకపోయాయి. ఓ వైపు ట్రెడిషనల్ గా కనిపిస్తూనే మరోవైపు బోల్డ్ పెర్ఫామెన్స్ తో కూడా ఈ భామ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఇక ఈ భామ తెలుగు లో ‘నిశ్శబ్దం’ సినిమాతో చివరిగా కనిపించింది. ప్రస్తుతం సినిమాల పరంగా తన కెరీర్ ఎలా వున్నా కానీ ఈ ముద్దుగుమ్మ తన అందాల ఆరబోతతో సోషల్ మీడియాను హీటెక్కిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు ఈమె చేసే గ్లామర్ షో నిత్యం హాట్ టాపిక్ అవుతూ ఉంటుంది. క్లీవేజ్ షో లు, థైస్ షో లతో ఈమె చేసే ఫోటో షూట్లు మామూలుగా ఉండవు అనే చెప్పాలి. ఇక తాజాగా మరోసారి తన హాట్ ఫొటోస్ తో ఇంటర్నెట్ లో అలజడి సృష్టించింది. ఆ ఫోటోలను లేట్ చేయకుండా మీరు కూడా ఓ లుక్కేయండి :






# బోరున వర్షం.. తడుస్తూనే ప్రజలకు సాయం

ప్రార్థించే పెదవులు కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అన్నారు పెద్దలు. ఈ మాటను అక్షరాల ఆచరణలో పెట్టాడు బాలీవుడ్ నటుడు సోనూ సూద్. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా..తోడుగా నిలిచాడు. తనకు చేతనైనంత మట్టుకు కష్టాల్లో ఉన్న ప్రజల్ని ఆదుకుని తోడుగా నిలిచి ప్రశంసలు పొందుకున్నాడు.నటుడిగా తన వెనుక నాలుగు రాళ్లు వెనకేసుకోకుండా.. సంపాదించిన డబ్బులో తన వంతుగా సాయం చేసి పేదల గుండెల్లో సోనూ సూద్ నిజమైన హీరోగా నిలిచాడు. గత కొద్ది రోజులుగా మహారాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక ముంబైను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా సాయం కోసం తన ఇంటి దగ్గరకు వచ్చిన వాళ్లను చూసి సోనూ సూద్ చలించిపోయాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చి.. తడుస్తూనే ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నాడు. అంతేకాదు.. ఎవర్నీ కాదనకుండా అందరితో సెల్ఫీలు, ఫొటోలు దిగి వాళ్లను సంతోష పెట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇక నెటిజన్లు అయితే ప్రశంసలు కురిపిస్తున్నారు. సోనూ సూద్ నిజమైన హీరో అంటూ కీర్తిస్తున్నారు.



# 50 ఏళ్ల వయస్సులో కూడా గ్లామర్ ఇమేజ్‌ను కంటిన్యూ చేస్తున్న టబు..

సాధారణంగా హీరోయిన్స్ ఏజ్ 50 ఏళ్లు దాటితే ఇక తల్లి పాత్రలకు అత్త పాత్రలకు షిఫ్ట్ అయిపోయావాల్సిందే. కానీ ఈ రూల్‌ను బ్రేక్ చేస్తున్నారు ఓ బాలీవుడ్ బ్యూటీ.52 ఏళ్ల వయసులోనూ గ్లామర్ రోల్స్‌లో రచ్చ చేస్తున్నారు. అంతేకాదు కుర్ర హీరోయిన్లకు పోటి ఇచ్చే రేంజ్‌లో ఫోటోషూట్స్ కూడా చేస్తున్నారు. ఏవరా బ్యూటీ అనుకుంటున్నారా.? సెకండ్ ఇన్సింగ్స్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు బాలీవుడ్ సీనియర్ బ్యూటీ టబు.సాధారణంగా హీరోయిన్స్ ఏజ్ 50 ఏళ్లు దాటితే ఇక తల్లి పాత్రలకు అత్త పాత్రలకు షిఫ్ట్ అయిపోయావాల్సిందే. కానీ ఈ రూల్‌ను బ్రేక్ చేస్తున్నారు ఓ బాలీవుడ్ బ్యూటీ. 52 ఏళ్ల వయసులోనూ గ్లామర్ రోల్స్‌లో రచ్చ చేస్తున్నారు.




GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written